అపస్వరాలు

బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

1. ఆవిడ

అప్పుడే నాలుగు గంటలు దాటిపోయింది! నాలుగున్నర కాకుండానే వస్తానన్నాడు విశ్వనాథం. అయిదుంపావుకి హాస్టలుసభ కూడా ఉంది. ఒక వేళ నేను ముస్తాబుకాకుండానే వచ్చేస్తాడో ఏమో. ఆవెధవ పుస్తకం చదువుతూ ఇంత పొద్దుపోయిం దనుకోలేదు. ఇంకా ఏ మూడుగంటలో అయ్యుంటుంది అనుకుంటున్నాను......ఆ పచ్చచీర కట్టుకుంటాను. నెల రోజులకిందట అది కట్టుకుని కాలేజికి వెళ్లినప్పుడు చీర చాలా బాగుందన్నాడు విశ్వనాథం నవ్వుతూను...... అన్నట్టు, పచ్చచీర కాదు, మొన్న కొత్తగా కొన్న నీలిరంగుచీర కట్టుకుంటాను. అవును, దానికి రంగు కుదిరే జాకెట్టుకూడా ఉంది... ఈ సబ్బుబిళ్ల ఎక్కడ పెట్టానో రోజూ మరిచిపోతూ ఉంటాను. నాకు ప్రత్యేకంగా ఒకగదీ, ఒకబల్లా, ఒకబీరువా ఉంటేనే కాని పరిపడదు. ఇదుగో, ఇక్కడే ఉంది......సరిపోయింది! గదిలో ఎవరో స్నానం చేస్తున్నారు. ఏమ్మర్రోయ్, ఇంకా ఎంతసేపు? అయిదు నిముషాలే! అవును. నేను తొందరగా ముఖం కడుక్కోవాలి. ఉన్నదానివి ఉన్నట్టుగా, ఒళ్లు తుడుచుకోకుండానే బయటపడమనలేదు, తల్లీ. నువ్వు బట్ట విప్పుకున్నప్పుడు నిన్ను చూడాలని నేనంత బెంగపెట్టుకోలేదు. త్వరగా కానియ్యి. అంతే... మొదట కలుసుకున్నప్పుడు విశ్వనాథం ఒట్టి పెంకిఘటంలా కనిపించాడు, ఎప్పుడూ పొగరుమోతులా వెకిలి నవ్వులు నవ్వుతూ. ఏదోఒకవిధంగా నాదగ్గరికి రావాలనీ, నాతో మాట్లాడాలనీ ప్రయత్నిస్తూ ఉండేవాడు. నేను దగ్గిరున్నప్పుడల్లా, తెనాలి రామలింగడినీ, గిరీశాన్నీ, మానూరి శంబరిప్రకాశంగారినీ మించిన హాస్యకాడిలా కబుర్లు చెప్పబోయి, ప్రతివాక్యానికీ చివరిని నాకేసి పరీక్షగా చూసేవాడు. నిజానికి విశ్వనాథానికి అంత తెలివితేటలు లేవు. అతనితో తరచు తిరిగే భీమశంకరానికి ఎక్కువ తెలివితేట లున్నాయి. ముక్తసరిగా మాట్లాడినా ముత్యాలలాంటి మాటలు మాట్లాడుతాడు భీమశంకరం. పల్లెటూరు హాస్యాలు కావు. మనిషిమాత్రం మరీ అందవికారంగా ఉంటాడు. అతను ఎన్నడూ పళ్లుతోముకున్నట్టే కనపడడు...... వచ్చేవు తల్లీ? స్నేహితు డొక డొస్తున్నాడు. ఎవరయితే ఎందుకులే! నువ్వు తర్వాత చూడలేవని కాదు. విశ్వనాథం......... గదంతా పాడుచేసి పోతారు. కంపుకంపు. దానికితోడు ఇదొక చీకటి కోణం. నిన్నరాత్రి జారిపడ్డాను కూడాను......... అన్నట్టు, తువ్వాలు మరిచిపోయాను ఈహడావిడిలో. అతను వచ్చేస్తాడో ఏమిటో. తువ్వాలు తెచ్చుకునే లోపున ఈగదిలో ఎవరూ దూరరుకద! జాకెట్టు విప్పి తలుపుమీద పెట్టిపోతాను...... ఎవరూ రాలేదు. కొళాయినీళ్లు ఎంత వేడెక్కిపోయాయి! ఈసబ్బుకి సువాసన మరీహెచ్చుగా ఉంది. మన స్వదేశీసబ్బులన్నీ ఇంతే అనుకుంటాను.... నాముక్కు దిద్దినట్టు తిన్నగా లేకపోయినా, నానుదురు మరీ చిన్నదయినా, నాగడ్డం ఆసినీమానటి శాంతాబాయి గడ్డం ఉన్నట్టు ఇత్తడిచెంబుయొక్క కిందభాగంలా ఉన్నా నా ముఖంలోఉన్న కళకాంతులు ఎవరిముఖంలోనూ లేవన్నాడు విశ్వనాథం, మొన్ననే చటుక్కున మరొక సంగతేదో మాట్లాడుతూ ఉండగా. నానల్లని విశాలమైన కళ్లుచూస్తే ఎవరైనా మిగిలిన లోపాలు మరిచిపోతారట. కాస్త వాగనిస్తే విశ్వనాథం వాగినట్టు మరెవరూ వాగలేరు. నిజానికి విశ్వనాథం చాలా అమాయకుడు. చిన్నపిల్లాడిలా కోపాలు పెట్టుకుంటూ ఉంటాడు. కానేపట్లోనే మళ్లీ చిన్న పిల్లాడిలా అన్ని కోపాలూ మరిచిపోతూఉంటాడు. శారద గురించి తను నాతోచెప్పిన మాటలకి నాకు నిజంగా కోపంవచ్చిం

దవుకున్నాడు. ఆరాత్రికిరాత్రి కూర్చుని ఎనిమిది పేజీల ఉత్తరం వ్రాసి పడేసేడు నాకు. శారదా నేనూ ఎప్పుడూ కలిసి తిరుగుతుంటే అందరూ ఏమిటో అనుకుంటారు.......జారిపోయిందీ సబ్బుబిళ్ల. ఈవెధవగదిలో కిందపడ్డసబ్బు మళ్లీ తీసుకునేందుకు లేదు. పోతే పోయింది. సరికొత్తబిళ్ల. నిన్ననే కొన్నాను. మరొక నాలుగణాలు దండుగ. బజారులో మూడణాలన్నారే. ఇక్కడ నాలుగణాలు...విశ్వనాథం నన్ను కలుసుకోక ముందు ఏ ఆడపిల్లతోనూ స్నేహం చెయ్యలేదు. తనకి గుంటూరులో ఆడస్నేహితు లున్నట్టు డాబుచేస్తాడు కాని, నేనే అతని మొదటి స్నేహితురాలిని. ఈ మొగపిల్లలు ఇంతకిముందు ఆడవాళ్లతో సహవాసం ఉన్నవాళ్లో, లేనివాళ్లో తెలుసుకునేందుకు ఒకటే గుర్తు. ఇంతకిముందే ఆడవాళ్లతో సహవాసం ఉన్నవాళ్లు కొత్తగా మన సహవాసం సంపాదిద్దామని ఉద్దేశించినప్పటికీ అంత తెలివితక్కువగా మనవెంట పడరు. విశ్వనాథం మొదటిలో నవ్వుతూ ఉండేటట్టు మనం కనపడగానే వెకిలినవ్వులు నవ్వరు. మనవెంట పడకుండా మనని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తారు. మళ్లీ, వాళ్ల మానానికీ కొత్తవల్ల సిగ్గుపడేవాళ్లు మాట్లాడకుండా ఉండడానికీ చాలాభేదం ఉంది. మొన్న శలవలలో కలసుకున్న పెద్దమనిషి ఆడపిల్లల్ని కొందర్ని ఎరుగుండుండాలి. లక్నోలో ఆయన చదువుచెప్తున్న ఆడపిల్లలే కొందరుండుండాలి. రెండురోజులు ఇంట్లో పెట్టుకుని, నాన్న ఆయన్ని నన్ను పెండ్లిచేసుకునేటట్టు చేద్దామని ప్రయత్నించాడు కాని ఆమనిషి పట్టుపడలేదు. చాలా గడుసుమనిషి. ఆయన వెళ్లిపోయాక ఆయన కొక ఉత్తరంకూడా వ్రాసేను. అదిచూసి ఏమనుకున్నాడో! జవాబు మాత్రం ఇవ్వలేదు. నాన్న తొందరపడకుండా అప్పుడప్పుడు కొంతసేపు మమ్మల్నిద్దరినీ వదిలేస్తే ఆయన ఏమి చేసుండునో! ఆఖరాఖరికి ఆపెద్దమనిషి నాతో కూర్చుని మాట్లాడడం తనకి నచ్చినట్టూ, నాకు తను లోబడుతున్నట్టూ కనపడ్డాడు. నాన్న కిలాంటి సంగతులేవీ తెలియవు. నాన్న ఒట్టి అమాయకుడు. అమ్మఎంత చెప్తే అంతే. ఎన్నడూ గట్టిగా తను మాట్లాడడం వినలేదు.....ఈ జాకెట్టేదీ? కిందపడిపోయింది. రామ రామ! గదిలో మూలపడెయ్యాలి. చాకలివాడు మళ్లా శనివారంనాడు వచ్చేదాకా అక్కడే పడుంటుంది. పాతబట్టలకి సంచిఒకటి కొనాలి. జుట్టంతాకూడా తడుపుకున్నట్టున్నాను. హడావిడిలో ఏపనీ సమంగా జరగదు......విశ్వనాథం ఇంకా రాలేదనుకుంటాను. లేకపోతే కబురొచ్చుండును. అతనికి నేనంటే ప్రతిరోజూ పెరిగిపోతోంది ప్రేమ. నావల్ల తన చదువు క్షీణిస్తోందని గోలపెట్టున్నాడు. ఈమధ్య, అందరి ఎదురుగుండానూ నాతో మరీ చనువుగా ఉన్నట్టు ప్రవర్తించొద్దంటే కోపం తెచ్చుకున్నాడు. నాలుగురోజులు మాట్లాడలేదు. రావలసినరోజున రాలేదు. నేను మళ్లీ క్షమించమని ఉత్తరం వ్రాసేవరకూ చూడడానికి రాలేదు. అప్పుడు వచ్చిననాడు మళ్లీ అపరిమితానందం చూపించాడు. నే నేమిటి చెయ్యమన్నా చేస్తా డతను. ధనవంతుడు. ఖరీదైన బహుమానా లిస్తాడు. వద్దంటే వినడు. చాలాడబ్బు గణించుండాలి విశ్వనాథం తండ్రి. నాకంటె అతను ఒక్క ఏడాదే పెద్ద...ఈ చీర పెట్టెకి అడుకిందుగా ఉంది కాబోలు. పెద్దపెట్టెబదులు రెండు చిన్న పెట్టెలుంటే బాగుండును. నాన్నకీ అమ్మకీ బుద్ధిలేదు. ఈ పెద్ద తోలుపెట్టె ఎవరు కావాలన్నారు? పైగా, నాకోసం అప్పుడే కొనేసి ఉంచామని కబురు చెప్పడం! దీనికి సరిపోయిన జాకెట్టేదీ? అన్నట్టు, నిన్ననే చాకలివాడికి వేసేను. పోనీ, ఇది సరిపోతుందనుకుంటాను. ఇదికాదు. సరే, ఏదో ఒకటి...ఏమిటంటావు? విశ్వనాథం వచ్చేసేడా? కూర్చోమన్నావా? ఎందుకలా నవ్వుతావు? చెవిలో సబ్బుండిపోయిందా? ఏమీ లేందే! 'హేజలిన్ స్నో' పూసుకుంటున్నాననా? నువ్వెన్నడూ పూసుకోనట్టు! నీ వకీలుస్నేహితు డొచ్చినప్పుడు నువ్వు చేసుకునే సింగారాలో? ఊరికా మాట్లాడకూ! నేను చీర కట్టుకోవాలి. పైకైనా వెళ్లు. లోపలికైనా రా. సరే పో...ఇంకా నాలుగున్నర కాకుండానే సిద్ధం అయినట్టుంది విశ్వనాథం. కోపాలు పెట్టుకోకుండా ఈవాళ సరదాగా మాట్లాడితే బాగుండును. పెళ్లిచేసుకోమని అడుగుతాడేమో విశ్వనాథం ఎప్పుడైనా!

నా కేమీ తోచడంలే దీవాళ. గుండెలో ఒక దడ మోస్తరుగా ఉంది...పెట్టె తాళంవేసేనా? లేదు. నానా చీకాకుగానూ ఉంది. అద్దం ఏదీ? అసహ్యంగా ఉన్నాను. తలైనా సరిగ్గా దువ్వుకునేందుకు వేళలేదు. నాకోసం అక్కడ కాచుకుని కూర్చోడం తనకి ముమ్మాటికీ నచ్చదని అనేకసార్లు చెప్పేడు విశ్వనాథం...మళ్లీ వచ్చావు, తల్లీ. నువ్వు పైకి వెళ్లేటట్టయితే గదికి తాళం వేసుకుని వెళ్లు. నా దగ్గిర తాళం ఉంది. ఇదుగో, వెళ్తున్నానుకా.

*

* *

2. అతను

ఒరే, సుబ్బారావు, ఆ తువ్వాలూ సబ్బుబిళ్లా అక్కడపెట్టి—తర్వాత స్నానం చేద్దుగాని—నాజోళ్లకి కాస్త రంగువేసిపెట్టూ. వెధవగీర్వాణాలకి పోకుమరి. ఇలాంటిపనులు నీ కెన్నిసార్లు చేసిపెట్టేనో. అవునురా. తొందరగాపోవాలి. అప్పుడే నాలుగుకావచ్చింది. నాలుగున్నరకి అక్కడుండకపోతే ఏడుస్తుంది. నీ ముఖం! రంగువేసిపెట్టు మరి. అలాగ!...అయితే, నన్ను చూస్తే ఎవరూ మోహించరంటావా? గుంటూరులో నా శోభ నీకు తెలియదు మరి. దరిద్రపు కాకినాడలో పుట్టిపెరిగేవు. అయితే రంగువెయ్యడం అంటే అంతే? మరికొంచెం రంగు పులిమి ఆ గుడ్డముక్కతో జోళ్లు కాస్తమెరిసేటట్టు తోమరా, నాయనా. సరే, పో. నేనే చేసుకుంటానులే. మళ్లా నీ కేపనైనా చేసిపెడ్తే ఒట్టు...ఈ పని చేసుకునైనా స్నానానికి వెళ్లేనుకాదు. ఇప్పుడు చేతులు మళ్లీ రంగవుతాయి. మళ్లీ సబ్బుతో చేతులుకడుక్కొని రావాలి ... ఏమిట్రా, మళ్లీవచ్చావు? అవునుమరి, నీ తాళం నువ్వు దగ్గిరుంచుకోకపోతే ఎలాగ? నేను గదికి తాళంవేసి వెళ్లిపోతాను...ఈ సుబ్బారావుగాడికి కల్యాణిసంగతంతా చెప్పేస్తున్నాను. వీడుతీరానలుగురికీ ఊదేస్తాడో ఏమిటో. ఊదడానికి ఏముందని కాని... ఈకిటికీలో చెయ్యి కడుక్కుంటే చాలు. అంత మరీ రంగు కాలేదు...ఈసెక్ సైలన్నా, ఈపంట్లాములన్నా, ఈకోట్లన్నా నాకు విసుగుపుట్టోంది. కాంగ్రెసు రాజ్యంవచ్చాక ఈవేషాలన్నీ పనికిరావని వాళ్లొక తీర్మానం జరిపితే బాగుండును. మొన్న కల్యాణితో మాట్లాడుతూ కాలేజికి మొగాళ్లందరినీ గోచీలతో రానిస్తే బాగుండునని నేనంటే 'అవిమట్టుకు ఎందుకు?' అని జవాబుచెప్తూ అమాంతంగా గట్టిగా నవ్వడం మొదలెట్టింది. చుట్టుపక్కల వాళ్లంతా మాకేసిచూడడం మొదలెట్టేరు. ఈమాటకూడా సుబ్బారావుగాడికి చెప్పేను. వాడు, ఆడవాళ్లందరూ పోకిరీ లయిపోతున్నారంటూ, కల్యాణిపేరు చెప్పి తిట్టిన తిట్లు ఇన్నన్నికావు. నాకూ కల్యాణికీ ఉన్న పరిచయబలం వాడికింకా పూర్తిగా బోధపడలేదు.... నా తెలివితేటలు అపరిమితమైనవని కల్యాణి ఉద్దేశ్యం. నన్ను కలుసుకున్నప్పటినుంచీ నేను దగ్గిరుండగా, మిగిలిన వాళ్లెవరు మాట్లాడుతూ ఉన్నాకూడా, నాకేసే చూస్తూ కూర్చుంటుంది. క్లాసులోకూడా అంతే. నాకు చదువులో అంతశ్రద్ధ లేకపోయినా లోకజ్ఞానంలోనూ, హాస్యపు కబుర్లు చెప్పడంలోనూ నన్నుమించినవాడు లేడని కల్యాణికి తెలుసును. మొదటిరోజులలో నేను తమాషాగా మాట్లాడుతుంటే, ఒకటేనవ్వు నవ్వేది నేను మాటనడం తడవుగా...... సరిపోయింది! ఈ పంట్లాముకి ముఖ్యమైనచోట బొత్తాం విరిగిపోయింది. ఈ చాకలాళ్లందరూ ఒక్కసారిగా చస్తే బాగుండును! ఇప్పుడేమిటి చెయ్యడం? నా దురదృష్టం కొలదీ నా మిగిలిన మూడుసూటూ చాకలాడికి పడ్డాయి. కుట్టించేందుకు వేళలేదు. 'సేఫ్టీ' పిన్ను పెడ్తే సరిపోతుంది. పొద్దున్న సుబ్బారావు దగ్గిరొకటి చూసేను. ఇదిగో, బల్లమీదే పడేశాడు వాడు. అదృష్టవంతుడినే ఈ రోజుకి...... అన్నివస్తువులూ బల్లమీదే పడేస్తాడు ఈ సుబ్బారావుగాడు. ఎంత చెప్పినా లాభంలేదు .... నాలుగు గంటలయిపోయిందప్పుడే. ఆలస్యంఅయితే గోలపెట్తుంది. గోల పెట్తుందన్న మాటేకాని, నిజానికి, నేనువెళ్లిన పది పదిహేను నిముషాలవరకూ హాజరవదు. ఎప్పుడూ, ముందు తన స్నేహితురాలు, ఆ శారద వచ్చి, ఎంతో ఆప్యాయంగా నవ్వుతూ కూర్చోమని చెప్తుంది. నేనూ కల్యాణీ మాట్లాడుతున్నంతసేపూ ఏదో ఒక మిష పెట్టుకుని కల్యాణికి కనపడకుండానూ, నాకు

కనపడేటట్టూ ఎక్కడో ఒకచోట పచార్లు చేస్తూనో, మంచునో, కూర్చునో సిద్ధం అవుతుంది. కల్యాణితో ఎప్పుడైనా చెప్దామనుకుంటే, నామాట నమ్మక, కస్సుబుస్సు మంటుందేమోనని కంగారు. ఈ ఆడపిల్లలు ఒకరితో ఒకరు ఇంతస్నేహంగా ఎందుకుంటారో నాకు తెలియదు. వీళ్లని బోధపరచుకోడం కష్టం........నాలుగూ అయిదునిముషాలు! రిక్షాలో వెళ్తేకాని వేళకి చేరననుకుంటాను. రిక్షా అయినా రమారమి అరగంట తీసుకుంటుంది. నా తాళాలేవీ? వీటికోసం వెతుక్కునేసరికి పుణ్యకాలంకాస్తా దాటిపోతుంది. స్నానాలగదిలో మరిచిపోయానేమో. లేదు. చేతిలో ఆడిస్తూ తెచ్చినట్టే జ్ఞాపకం. ముక్కూ, చెవులూ, వేళ్లూ ఉన్నట్టు దేవుడు మిగిలిన అవయవాలతోపాటు జన్మలో కావలసిన తాళాలన్నీకూడా శరీరాన్నే ఎప్పుడూ అంటుకునుండేటట్టు మనందరినీ సృజిస్తే బాగుండును. ఇవుగో, పంట్లాం జేబులోనే ఉన్నాయి. వీటి దుంపతెగ! మరి తాళంకప్పో? ఈ బల్లనిండా పుస్తకాలు పడేస్తాడు వీడు. చదువూలేదు మన్నూలేదు. ఇదుగో నాలుగూ పదయిందప్పుడే!.........ఒరే, రిక్షా, ... ఎంత కావాలి? ఆరణాలే! రంగూను వెళ్లిరావచ్చు నా డబ్బుకి. రెండణాలిస్తాను. సరేపో. పోనీ, రెండణాలన్నర. మూడణాలకి తక్కువకి రావు? సరే, రా. అవసరంగా వెళ్లవలసొచ్చింది. బేరమాడేందుకు సమయంకాదు. త్వరగా పద బక్కపీనుగులా ఉన్నావు నిన్ను తిట్టడంలేదురా, బాబూ. నీకు తెలుగు సమంగా రాదు. చెన్నపట్నంలో మాకు ఇదొకగోల... నాలుగూ పదిహేను! ఎన్నాళ్లు పోయాక, కల్యాణిని చూడడానికి వెళ్లేప్పుడు నా కీ గుండెదడదడ మానుతుందో! కలుసుకున్నప్పుడు మొదట కల్యాణి చాలా గర్విష్ఠురాలిలా కనిపిస్తుంది కాని, నిజానికి చాలా మంచి అంతఃకరణ, చాలా నిర్మలమైన హృదయం. నేనంటే తనకి అపరిమితమైన ప్రేమ. నన్ను కలుసుకున్న మొదటి రోజునుంచీ తన మనసులో మిగిలిన కుర్రాళ్లందరూ ఒక ఎత్తనీ, నేనొకడినీ ఒక ఎత్తనీ చెప్పింది. ఉండి ఉండి నాతో అలాంటి మాటొకటి అంటూఉంటుంది. ...ఓయ్, రిక్షా, కొంచెం త్వరగా పోనియ్యి మరి. తొందరగా వెళ్లాలి...అప్పుడప్పుడు కల్యాణి చాలా తెలివితక్కువగా మాట్లాడుతూఉంటుంది. నిన్నపిల్ల నాకంటె తను ఒక ఏడాదే చిన్న. కాని, లోకజ్ఞానం చాలా తక్కువ. ఆ మధ్య తను అందరిఎదుటా తనతో మరీ చనువుగా ఉండొద్దని నాతో చెప్పినప్పుడు, నేను తనకేసి చూడడం మానేసి, తనని చూడడానికి కూడా వెళ్లకపోయేసరికి, ఏకన్నూ పెద్ద ఉత్తరం వ్రాసింది. జాలిపడి నేను మళ్లీ చూడడానికి వెళ్లినప్పుడు నన్ను చూసి తనుపడ్డ ఆనందం వర్ణించనలవి కాదు...ఏయ్, రిక్షా, అక్కడికికాదు. ఇంకా పైకి వెళ్లాలి. నేను ముందేచెప్పేనుకా. మూడణాలు ఇక్కడికేననుకున్నావా? నీకు మతిపోయిందేమిటి? పోట్లాడితే జాగ్రత్త. ఎందుకొప్పుకున్నావు మరి?......వీడు పోట్లాడుతాడో ఏమిటో, గోల!...ఆడ · ళ్లకి మలాగ్గా లొంగిపోతే లాభంలేదు. అప్పుడప్పుడు మనం కొట్టుసరిచేస్తేకాని మనకి గడవనూగడవదు, వాళ్లకి మనం అంటే మర్యాదా ఉండదు. ఒక్కవారంరోజులు తనకేసి చూడకుండా నిర్లక్ష్యంగా తిరిగేసరికి మళ్లీ నాకాళ్లమీద కొచ్చిపడింది. ఆ సమయంలో అది నేను కాకుండా మరొకడైయుంటే తెలివితక్కువవల్ల మరీలోకువై పోయుండును. ఎల్లకాలం వాళ్లగురించే ఆలోచిస్తున్నట్టూ, వాళ్ల వెంటేపడుతున్నట్టూ, వాళ్లకోసమే పడి ఏడుస్తున్నట్టూ స్థిరమైన అభిప్రాయం కుదరనివ్వకూడదు. కల్యాణికి నిజంగా అంత అనుభవజ్ఞానంలేదు. లేకపోతే అంత తెలివైనపిల్లకి అంతసున్నితమైన స్వభావంఉండడం కష్టం. నన్నుకలుసుకున్నంతవరకూ ఎన్నడూ పరాయిమొగవాడితో ఇంత చనువుగా మాట్లాడదు. మన కుటుంబాలలో శారదాచట్టాలు ఎన్నివచ్చినా పరిస్థితులు అంతేకా... ... ... నిజానికి, కల్యాణి నన్ను ప్రేమించినంత కల్యాణిని నేను ప్రేమించలేననుకుంటాను. తను నాకువ్రాసిన ఉత్తరాలు కొన్ని సుబ్బారావుకి చదివి వినిపిస్తే వాడు గుండె బాదుకున్నాడు. ఇంగ్లీషు బాగా వ్రాయలేదు కల్యాణి. సుబ్బారావుకి చదివి వినిపించేటప్పుడు, తప్పులుసద్ది, తప్పులున్నట్టు తెలియపరచకుండా చదివి వినిపించాను. అందువల్ల సుబ్బారావు కల్యాణి వ్రాసే ఇంగ్లీషుశైలికూడా విని ఆశ్చర్యపడ్డాడు ... ... కల్యాణి అంత అందమైనదికూడా కాదు. ఆ ముక్కూ ఆగడ్డం మరీ అంద

వికారంగా ఉంటాయి. ఆ కళ్లయినా, మంచి నలుపైనప్పటికీ, మంచి విశాలం ఉన్నవైనప్పటికీ, దారుఢ్యం లేనివాళ్ల కళ్లల్లా దిగపడిపోయి ఉంటాయి. ముఖం చూసి మోహించడం కష్టం. సుందరిముఖం. సుందరిముఖాలు నాకు నచ్చవు. కల్యాణి శరీరసౌష్ఠవం కూడా అంత చెప్పుకోతగినది కాదు. కాని చాలా తెలివైనది. శరీర సౌష్ఠవానికి నా చిన్నప్పుడు కార్లేకారు సర్కస్సులో తీగమీద నడిచిన మలయాళపు పిల్లతర్వాతనే ఎవరినైనా చెప్పాలి. వాళ్లు గుంటూరులో ప్రదర్శనా లిస్తున్నప్పుడు ఆ పిల్లని చూసి నేను మోహించినట్లు నేనెన్నడూ మరెవరినీ మోహించలేదనుకుంటాను. బిగుతుగా పట్టేసి, నిగనిగ మెరిసేపీ ఆబట్టలు తొడుక్కుని గొడుగు దివ్యంగా ఆడిస్తూ ఆతీగె మీద నడుస్తుంటే నా ఆనందం చెప్పాలా? చిత్రం, నాకప్పుడు పన్నెండేళ్లో పదమూడేళ్లో! ఆపిల్లకి పాతికేళ్లదాకా ఉండుండొచ్చును! ఆపిల్ల ఎక్కడ, కల్యాణి ఎక్కడ!......... ఏమోయ్, రిక్షా, ఇక్కడే ఆపు. నాదగ్గర మూడణాల చిల్లర లేనట్టుందే. నీదగ్గిర చిల్లరుందా? నాలుగణాలకి. లేకపోతే ఎలా అనుకున్నావు మరి? తర్వాత నాగదికి రా...అక్కడికొచ్చి విశ్వనాథంగారికోసం వచ్చానని చెప్పు ఇస్తాను. ఏమిటి చెయ్యమంటావు మరి? వెంటపడకు. ఎక్కడికొస్తావు? చిల్లర లేదంటే వినవేమి? కావలిస్తే, రెండణా లిప్పిడిస్తాను. తర్వాత వచ్చి అణా పుచ్చుకో. ఏమిటా అనుమానం? నీతో తప్పుపేరు చెప్పి అబద్ధాలాడుతున్నాననా? వెంటపడ్డావంటే జాగ్రత్త. సరే, ఈ నాలుగణాలూ తీసుకుపో. వెధవగోలా నువ్వూను. తిట్ట కేంచేస్తాను? వెధవా!... ఈరిక్షాలలో రావడమే తప్పు. కల్యాణి ఈవాళైనా సరదాగా మాట్లాడితే బాగుండును. నా కేమీ తోచడం లేదీవాళ. పరిమితి లేకుండా నన్ను ప్రేమిస్తున్నానని చెప్తే బాగుండును......అదుగో, అప్పుడే చూసింది నన్నా శారద. అవునండీ, కల్యాణికోసమే వచ్చాను. కూర్చుంటాను లెండి......శారదకి నేనంటే ఇంత అపేక్ష ఎందుకో! ......అవునండీ, కల్యాణికోసమే. అప్పుడే వారెవరో చెప్పేందుకు వెళ్లేరు......ఈ ఆడపిల్లలకందరికీ తెలుసును నేను కల్యాణికోసం వస్తున్నానని. కాని ప్రతిసారీ ఒకడజనుమందైనా నన్నడిగితేనేకాని తృప్తిపడరు. ......వెధవ రిక్షావాడు నాలుగణాలు లాక్కుపోయాడు......ఏమండీ? వస్తోందా? సరే లెండి. మిమ్మల్ని చాలా కష్టపెట్టేను.........వస్తోందని చెప్పడానికి మళ్లీ ఎందుకో రావడం ఈ శారద?.........అదుగో కల్యాణి!

* * *

3 వాళ్లిద్దరూ

ఆవిడ:—నాలుగన్నర కాకుండానే వచ్చేసే వీవాళ!

అతను:—నాలుగున్నర దాటి ఏనాడయింది?

ఆవిడ—ఏదీ, ఎంతయింది చూడనీ. అబ్బో! నీ గడియారం సరిగ్గా తిరుగుతోందీ? నేనింకా నాలుగున్నర దాటలేదనుకుంటున్నాను. తలదువ్వుకోబోతుంటే నువ్వు వచ్చినట్టు కబురొచ్చింది. దువ్వుకోకుండానే వచ్చేసేను. నానా అసహ్యంగానూ ఉంది జుట్టు.

అతను:—ఇప్పుడే స్నానం చేసేవా?

ఆవిడ:—అవును ...ఏమి టింత మౌనంగా ఉన్నావీవాళ?

అతను:—ఏమీ లేదు.

ఆవిడ:—నువ్వువచ్చేరోజున పొద్దుటినుంచి నువ్వువచ్చేవేళకోసం ఎదురుచూస్తూ కూర్చుంటాను. నాకు మరొక పనేదీ జరుగదు. రోజల్లా అదే ఆలోచన. నీలాకాదు నేను....బయలుదేరేవేళకి తప్ప నీకు నేను జ్ఞాపకమే రాననుకుంటాను!

అతను:—నువ్వు మనకాలేజికివచ్చేటప్పుడు రిక్షావాడికి ఎంతిస్తావు?

ఆవిడ:—ఆ ప్రశ్నెందుకిప్పుడు?...రెండణాలు.

అతను:—ఇంతే?

ఆవిడ:—అవును. అంటే, ఇద్దరిద్దరం వెళ్తాం కాదూ, చెరొక రెండణాలూ ఇస్తాము.

అతను:—రిక్షాలో ఒక్కరే వెళ్తే?

ఆవిడ:—అప్పుడప్పుడు మూడణాలకే కుదురుతారు. అప్పుడప్పుడు నాలుగణాలూ ఇవ్వవలసొస్తుంది. ఎందుకీ ప్రశ్నలన్నీ?

అతను:—ఈవాళ నేనిక్కడికి రిక్షాలో వచ్చానులే. మూడణాలకి బేరమాడేను. తీరా ఇక్కడికి వచ్చాక నాలుగణాలు పుచ్చుకుంటే కాని వదిలేడు కాడు.

ఆవిడ:—పోనిద్దూ, ఒక అణాయేగా నష్టం.

అతను:—అణాకోసం కాదు...నువ్వెప్పుడూ ఇంతే. ...ఈ రిక్షావెధవలు...

ఆవిడ:—అవునులే. వాళ్లంతా దొంగవెధవలు. నాకు తెలుసును. నేనుకూడా అనేకసార్లు వాళ్లతో పోట్లాడేను...నువ్వివాళ ఎందుకో సరదాగా లేవు.

అతను:—సరదాగా లేకేమి?...అన్నట్టు నేనుచెప్పిన సినీమాకి వెళ్లేవా?

ఆవిడ:—'భాగ్యచక్ర' కేనా? వెళ్లేను. నిన్న సాయింత్రమే వెళ్లేను.

అతను:—ఎలా ఉంది?

ఆవిడ:—బాగానే ఉంది. హిందీ తెలియకపోవడం వల్ల కొన్నికొన్నిచోట్ల బోధపడలేదు...నిన్న మన క్లాసువాళ్లు చాలామందొచ్చారు ఆ సినీమాకి.

అతను:—ఎవరెవరు?

ఆవిడ:—చాలామందొచ్చారు. నిరంజనరావు, నారాయణ స్వామి, వెంకటశాస్త్రి, సుందరరావు, ప్రకాశరావు, శివరామ కృష్ణయ్య...

అతను:—ప్రకాశరావు కూడా వచ్చాడా?

ఆవిడ:—వచ్చాడు. రావడమే కాకుండా, తనకారులో మమ్మల్నిక్కడికి తీసుకువచ్చి దిగపెట్టేడు కూడాను.

అతను:—మిమ్మల్నంటే ఎవరెవరిని?

ఆవిడ:—నాతో ఇక్కడనుంచి మరొక ఇద్దరుపిల్లలు వచ్చారు.

అతను:—ఇంతమందికి అతని చిన్నకారు సరిపోయిందీ?

ఆవిడ:—సరిపోకేమీ? మేము ముగ్గురమూ... అంటే, అదే, మిగిలినఇద్దరూ వెనకసీట్లో కూర్చున్నారు. నేను ముందుసీట్లో కూర్చున్నాను. అతను నడుపుతున్నాడు.

అతను:—ఏమంటాడు ప్రకాశరావు?

ఆవిడ:—ఏమంటాడు? 'భాగ్యచక్ర' చాలా బాగుందన్నాడు.

అతను:—ఉఁహూ.

ఆవిడ:—తర్వాత... ఎప్పుడైనా నన్ను చూడడానికి ఇక్కడికి వస్తానన్నాడు... ఈవాళే వస్తానన్నాడసలు...

అతను:—నువ్వు రావద్దన్నావా?

ఆవిడ:—తర్వాత ఎప్పుడైనా రమ్మన్నాను. కావలిస్తే, రేపు రమ్మన్నాను.

అతను:—నేనుండగా అతను రాకూడదనా?

ఆవిడ:—అదికాదు. అతనొస్తే మనం మామూలుగా మాట్లాడుకునేందుకు వీలుండదని.

అతను:—ఇప్పుడే చెప్తున్నాను, కల్యాణీ! నువ్వుమట్టుకు రేపు ప్రకాశరావువచ్చినప్పుడు అతన్నిచూడడానికి దిగొస్తే, నేను మరెన్నడూ నిన్ను చూడడానికి రాను, నీతో మరెన్నడూ మాట్లాడను.

ఆవిడ:—తీరా అతనొస్తే చూడకుండా ఉండడం ఎలాగ?

అతను:—ఎలాగేమిటి? నిశ్చయించుకుంటే అనేకమార్గాలుంటాయి. శెలవని కబురుపంపించు. లేకపోతే ఆవేళకి ఎక్కడికైనా వెళ్లిపో.

ఆవిడ:—అతన్ని రమ్మని నేనేచెప్పి, వచ్చాక చూడకపోతే బాగుంటుందా?

అతను:—ఎందుకు రమ్మని చెప్పేవు?

ఆవిడ:—అతను వస్తానంటుంటే నేనేమని చెప్పను మరి?

అతను:—ఏదో సామెత చెప్పినట్టుంది. అన్నిటికీ ముఖ మాటమే?

ఆవిడ:—అతను కారులో ఇక్కడ దిగపెట్టి అప్పుడన్నాడు 'ఎప్పుడైనా వస్తా'నని.

అతను:—అతని కారులో ఎందుకు రావాలి నువ్వు? అక్కడ రిక్షాలులేవూ? ట్రాము లేదూ?

ఆవిడ:—అతను మర్యాదగా కారులో దిగపెట్టానంటుంటే ఎలావద్దనడం? అన్నిటికీ తప్పు పట్టావు నువ్వు. నాకేమీ తెలియదు. నేనొక తెలివి తక్కువ మొద్దుని.

అతను:—నువ్వేమీ మొద్దువికావు. చాలా గడుసు దానివి.

ఆవిడ:—ఈవాళ పొద్దుటినుంచి నువ్వు వస్తావనీ, నీతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కాలంగడపొచ్చు ననీ ఆశ పెట్టుకున్నాను. రావడమే రుద్రుడులా వచ్చావు. ఈరోజల్లా నేను పడుతున్న చీకాకు లన్నీ నీతోచెప్తే నీకు తెలుస్తుంది నాతో ఇలా మాట్లాడి నువ్వు నన్నెంత కష్టపెట్టున్నావో.

అతను:—నిన్నెవరు కష్టపెట్టున్నారు? నిన్ను కష్టపెట్టగలిగే శక్తిగూడా ఉందేమిటి నాకు? ఏమిటి నీ చీకాకులన్నీ?

ఆవిడ:—ఎందుకు చెప్పమని ఏడవడం నీకు నాలో సరదా లేకపోయాక?

అతను:—అయినా చెప్పు.

ఆవిడ:—నిన్నరాత్రి స్నానాలగదిలో జారిపడ్డాను. కాలు బెణికింది. వెన్నుఅంతా నొప్పిగా ఉంది. నిన్నరాత్రి నిద్రలేదు. ఈవాళ పొద్దుటినుంచి తలనొప్పిగానూ, ఒళ్లంతా బాధగానూ ఉంది. నడవడానికి కూడా కష్టంగా ఉంది.

అతను:—ఇప్పుడిలావస్తూ కుంటలేదే నువ్వు!

ఆవిడ:—కుంటాలికూడా కాబోలు.

అతను:—ఇంకాఏమిటి నీ చీకాకుకి కారణాలు?

ఆవిడ:—నీకంతా వేళాకోళంగా ఉంది.

అతను:—వేళాకోళం కాదు. చెప్పు.

ఆవిడ:—నాసబ్బుబిళ్ల పోయింది.

అతను:—సబ్బుబిళ్ల పోతేనే చీకాకా?

ఆవిడ:—రోజుకొక సబ్బుబిళ్ల పోతోంది. ఎలా పోతుందో తెలియదు. బజారులో మూడణాలన్నారే. ఇక్కడకొంటే నాలుగణాలూ అయిదణాలూను.

అతను:—ఒక్క అణాకదా భేదం!

ఆవిడ:—భేదం ఎంతయితే ఏమిటి, రోజు కొక సబ్బుబిళ్ల కొనుక్కోడం అవుతోంది. నీలా డబ్బున్నదాన్ని కాను.

అతను:—పోనిద్దూ, సబ్బుబిళ్లకి ఇంత హడావిడేమిటి? ఇంకా ఏమిటి కారణాలు?

ఆవిడ:—అదికాక శారదా నేనూ ఈవాళ ఘోరంగా పోట్లాడుకున్నాం.

అతను:—భేష్! దేనికని?

ఆవిడ:—దేనికేమిటి? ఒకకారణంఅని లేదు.

అతను:—అంత పోట్లాడుకున్నా, నేనొచ్చినట్టు నీతో చెప్పడానికి వెళ్లిందే మీస్నేహితురాలు!

ఆవిడ:—తర్వాత మళ్లీ తను వచ్చి నన్ను క్షమించమని అడిగింది లే...మరొకసంగతి నీ కింత వరకూ చెప్పలేదు. రెండువారాలకిందట మా అమ్మ నా కొక ఉత్తరం వ్రాసింది.

అతను:—ఏమని?

ఆవిడ:—నీకు చెప్పాలో, చెప్పకూడదో తెలియడం లేదు.

అతను:—చెప్పు. పరవాలేదు.

ఆవిడ:—ఎవరితోనూ చెప్పకూడదు నువ్వు.

అతను:—చెప్పను. చెప్పు.

ఆవిడ:—ఈయేడు పరీక్ష అయిపోయాక శలవలకి ఇంటికి వెళ్లినప్పుడు మానాన్న నాకు పెళ్లి చెయ్యాలని స్థిరపరచుకున్నాడట.

అతను:—ఎవరి కిచ్చి ?

ఆవిడ:—ఎవరో ఇద్దరు ముగ్గురిని చూస్తున్నా డట.

అతను:—నీకు తెలిసినవాళ్లా ?

ఆవిడ:— నాకు తెలియనివాళ్లే......అంటే, ఒకరిని మాత్రం ఎరుగుదును

అతను:—ఎవరది ?

ఆవిడ:—ఎవరో కృష్ణమూర్తి. లక్నోలో ఏదో కాలేజీలో ప్రొఫెసరు.

అతను:—నువ్వుచూసేవా ?

ఆవిడ:—చూసేను. చూసేను కాని మాట్లాడలేను. ఒకసారి ఆయన్ని మా ఇంటికి రప్పించాడు నాన్న, కిందటి శలవలకి నేను వెళ్లినప్పుడు. ఇందుకోసమని అనుకోలేదు నేను.

అతను:—మీ నాన్న నీకు పెళ్లిచేస్తానంటేకూడా నీకు చీకాకైతే ఎలాగ ?

ఆవిడ:— నాకు పెళ్లిచేసుకోవాలని లేదు. మా నాన్న వెతుకుతున్న సంబంధాలు నా కసలేనచ్చవు.

అతను:—ఆ లక్నో ప్రొఫెసరు నీకు నచ్చలేదా ?

ఆవిడ:—లేదు.

అతను:—ఎందుకు నచ్చలేదు ?

ఆవిడ:—ఎందుకంటే ఏమని చెప్పను? నచ్చలేదు. అంతే.

అతను:—నీకు నిజంగా ఎవరినీ పెళ్లిచేసుకోవాలని లేదూ ?

ఆవిడ:—లేదు....నీకో ?

అతను:—నీకులేకపోతే నాకూలేదు.

ఆవిడ:—నాజోలి నీ కెందుకు ?

అతను:—నాజోలి. నీకు లేదుకనక.

ఆవిడ:—పెళ్లాడితే నువ్వెటువంటిదాన్ని పెళ్లాడుతావో చెప్పు.

అతను:—నువ్వెటువంటివాడిని పెళ్లాడుతావో ముందు చెప్పు.

ఆవిడ:—నేను ఆ మనిషిని చాలాకాలం బాగా ఎరుగుండుండాలి.

అతను:—చాలాకాలం అంటే?

ఆవిడ:—అధమం రమారమి రెండేళ్లయినా అనుకో.

అతను;—బాగా ఎరుగుండడం అంటే?

ఆవిడ:—తరచు కలుసుకుంటూ ఉండాలి. అన్ని సంగతులూ మాట్లాడుకుంటుండాలి.

అతను:—ఇంకా వర్ణించు.

ఆవిడ:—అందంగా ఉండాలి. అందంకంటె తెలివితేటలు ఎక్కువగా ఉండాలి. తెలివితేటలంటే పరీక్షలలో చూపించే తెలివితేటలే అని కాదు. చమత్కారంగా మాట్లాడతూ ఉండాలి. ఎప్పుడూ నవ్వుతూఉండాలి. ఎప్పుడూ నవ్విస్తూ ఉండాలి.

అతను:—ఇదంతా నువ్వు నన్నే వర్ణిస్తున్నట్టు కనిపిస్తోందేమిటి ?

ఆవిడ:—నిన్నేమీకాదు. ఏమి గర్వం నీకు!

అతను:—నిజంగా నీకు నన్ను పెళ్లి చేసుకుందామన్న ఉద్దేశ్యం ఎన్నడూ కలగలేదూ?

ఆవిడ:—లేదు.

అతను:—నిజం చెప్పు.

ఆవిడ:—నాకు ఉద్దేశ్యం కలిగితేనట్టుకు ఏమిలాభం?

అతను:—ఏమీ తెలియనట్టు నటించకు.

ఆవిడ:—ఏమిటి నానటన ?

అతను:—నేనెందుకు నిన్నిక్కడ చూడడానికి ఇంత తరచుగా వస్తున్నానో, ఈరెండేళ్లబట్టీ నువ్వూ నేనూ ఒకచోటే ఉండడం నాకెంత ఆనందం కలగచేస్తోందో, నిన్ను నేనెంత ప్రేమిస్తున్నానో.....

ఆవిడ:—మరి గుంటూరులో నిన్ను ప్రేమిస్తున్న ఆఅందమైన పిల్లలందరూనో?

అతను:—గుంటూరులో ఎవరూ అటువంటి పిల్లలు లేరు కల్యాణీ.

ఆవిడ:—నిజంగా ?

అతను:—నిజంగా లేరు.

ఆవిడ:—నేను నమ్మను.

అతను:—నిజంగా చెప్తున్నాను. ఎవ్వరూ లేరు. నిన్నొక్కత్తెనే ప్రేమిస్తున్నాను నేను.

ఆవిడ:—ఇంతకిముందు నువ్వెవరినీ ప్రేమించలేదూ?

అతను:—లేదు.

ఆవిడ—నిజం చెప్పు.

అతను:—లేదు... అంటే, చిన్నప్పుడొకసారి కార్లి కారు సర్కస్సులో తీగమీద నడిచే పిల్లనొకత్తెని చూసి మోహించాను! ఒక నెలరోజులు మనస్తిమితంలేకుండా!

ఆవిడ :—అప్పుడు నీకన్నేళ్లు ?

అతను :—నాకా ? పదిహేనో పదహారో. ఆ పిల్లకి పంథొమ్మిదో ఇరవైయో

ఆవిడ :—భేష్! మోహించి ఏమిటి చేసేవు ?

అతను :—చేసేదేముంది? రోజూ వెళ్లి చూస్తూ ఉండేవాడిని.

ఆవిడ :—నిన్నావిడ చూసిందా ఎప్పుడైనా ?

అతను :—చూసింది. రెండుసార్లు. ఒకసారి, మొదటిసారి మాపినతల్లి కొడుకు రమణయ్యతో,—వాడొకరాడీ— వాడితో వెళ్లేను. అప్పుడు ఏవో మాటలలో మా ఇంట్లో కుక్క నాలుగు పిల్లల్ని పెట్టిందనీ, కుక్కపిల్లలన్నీ చాలా అందంగా ఉన్నాయనీ చెప్పేను. ఎలాగైనా ఒకకుక్కపిల్లని తనకి తెచ్చిపెట్టమంది. స్నేహితుడొకడికి కుక్కపిల్లకావాలని చెప్పి మానాన్నని బతిమాలుకుంటే ఇవ్వను పొమ్మన్నాడు. మా ఇంట్లో కుక్కపిల్లలన్నీ ఒక్కసారిగా హఠాత్తుగా చచ్చిపోయాయని చెప్పడానికి మళ్లీ వెళ్లినప్పుడు నన్ను రెండవసారి చూసింది. అంతే. ఎందుకు నవ్వుతావు ?

ఆవిడ :—కథలు చెప్పడానికీ, అబద్ధాలు చెప్పడానికీ నీతర్వాతే ఎవరైనా !

అతను :—నిజంగా, కల్యాణీ ఈ ఏడాదయిపోయాక నువ్వెక్కడుంటావో, నేనెక్కడుంటానో! ...నన్ను మరిచిపోకుండా నాకు ఉత్తరాలు వ్రాస్తూవుంటావా ?

ఆవిడ :—వ్రాస్తాను.

అతను :—వాగ్దానం చెయ్యి... చేతిలో చెయ్యివేసి.

ఆవిడ :—వాగ్దానం చేస్తున్నాను.

అతను :—చేతిలో చెయ్యివేసి.

ఆవిడ :—ఎవరైనా చూస్తారు

అతను :—పరవాలేదు. అలాగే...నన్నే పెళ్లి చేసుకుంటానని కూడా వాగ్దానంచెయ్యి.

ఆవిడ : —వదులు మరి. అందరూ వస్తూవెళ్తూ ఉంటారు...మరెవరినీ పెళ్లి చేసుకోను.

అతను :—అలాకాదు. నన్నే పెళ్లి చేసుకుంటానని వాగ్దానం చెయ్యాలి.

ఆవిడ :—అదుగో, వాళ్లెవరో చూస్తున్నారు. నిన్నే పెళ్లి చేసుకుంటాను...నా చెయ్యి వదలమన్నప్పుడే వదలవలసింది.

అతను :—పరవాలేదు, కల్యాణీ...కాని, ఇంతకి ముందు నువ్వెవరినైనా ప్రేమించావా ?

ఆవిడ:—లేదు. నువ్వే మొదటివాడివి. నాకు అటువంటి ఉద్దేశ్యాలు అంకురించేవేళకి సరిగ్గా నిన్ను చూసేను. నిన్ను చూసినప్పటినుంచీ మరొకరి మీదికి నా మనసు వెళ్లనేలేదు.

అతను:—నిజంగా ?

ఆవిడ:—నిజంగా. నువ్వీవాళ నన్ను పెళ్లిచేసుకుంటానని చెప్పకపోతే నేనీ జన్మంతా ఎంత దుఃఖపడుతూఉందునో నీకు తెలియదు.

అతను:—నిజంగా ?

ఆవిడ:—నువ్వు లేకపోతే నాకేమీ తోచదు. నువ్వు నాపక్కని లేనప్పుడు నే నేపనైనా చేస్తున్నట్టు నటిస్తూ ఉంటాను కాని అంతసేపూ నాఆలోచనలన్నీ నిన్నుగురించే. నాకు రోజురోజుకీ ఊపిచ్చిహెచ్చయి పోతోంది.

అతను:—నిజంగా ?

ఆవిడ:—ఇప్పుడు నువ్విక్కడున్నావు. నిన్నువదిలి వెళ్లాలని లేదు. నువ్వు ఈకాసేపట్లో వెళ్లిపోడం నాకెంతో దుఃఖంగా ఉంటుంది. నువ్వువెళ్లిన కొంతసేపటివరకూ మరెవరితోనూ మాట్లాడాలనిపించదు. ఎప్పుడూ నీతోటే ఉండాలని నాఆశ. ఒక పిట్టనయిపోయి నీగదికిటికీమీద

వాలి రాత్రి నువ్వు నిద్రపోతున్నప్పుడు కూడా నిన్ను చూస్తూఉండాలని ఉంటుంది.

అతను:—కల్యాణీ! రేపు ప్రకాశరావు వచ్చినప్పుడు ఏమిటి చేస్తావు?

ఆవిడ:—చూడను. లేనని కబురు పంపిస్తాను.

అతను:—అలాకాదు. జిగి చూడు. అయిదు నిముషాలు మాట్లాడి మరొకపనుందని చెప్పి లేచివెళ్లిపో. మళ్లీమళ్లీ వచ్చేటట్టు ప్రోత్సహించకు.

ఆవిడ:—ఛీ, ఛీ. ఇంకా నిన్ను నేనెంత ప్రేమిస్తున్నానో నీకు తెలియడం లేదు...అయిదుగంటలకి రమ్మన్నాను అంటే, అదే, అయిదుగంటలకి తనే వస్తానన్నాడు. అయిదూపది నిముషాలు కాకుండానే పంపించేస్తాను. నువ్వు అయిదుంపావుకి ఇక్కడికిరా. నీకే తెలుస్తుంది.

అతను:—ఛా, నేనెందుకురావడం? నీమీద నాకు అపనమ్మకాలు లేవు.

ఆవిడ:—మాటవరసకి చెప్తున్నాను.

అతను:—మరి మీ నాన్న నీకు కుదర్చబోతున్న సంబంధాలమాటో?

ఆవిడ:—మా నాన్న చాలా కోపిష్ఠి. ఎంతకోపిష్ఠి అయినా ఎలాగో ఒకలాగ ఒప్పిస్తాను. శలవలకి ఇంటికి వెళ్లగానే నీ మాట చెప్తాను. నీవిషయంలో ఒప్పుకోకపోతే ఎన్నడూ అసలు పెళ్లే చేసుకోనని చెప్పేస్తాను.

అతను:—అంత కోపిష్ఠా మీ నాన్న?

ఆవిడ:—నీకు తెలీయదు. మా అమ్మ ఇప్పటికింకా బెదిరిపోతూ ఉంటుంది.

అతను:—నాసంబంధం ఒప్పుకోరంటావేమిటి మీ నాన్న? నేను ఉద్యోగం చెయ్యడంలేదనీ....

ఆవిడ:—అంత సులభంగా ఏదీ ఒప్పుకునే రకంకాదు. నాకు భయంగానే ఉంది. మీనాన్న ఒప్పుకుంటారా?

అతను:—మానాన్న చాలాకాలం కిందటే చెప్పేసేడు, నాకు నచ్చినపిల్లని నేను చేసుకునేందుకు తనకేమీ అభ్యంతరం ఉండదని. పిల్లమట్టుకు మంచి కుటుంబానిదై యుండాలన్నాడు. నీ విషయంలో ఏమీ అభ్యంతరాలుండవు. అది నా పూచీ. మా అమ్మకూడా చాలామంచిది. నేనంటే తనకి చాలాప్రేమ.

ఆవిడ:—మా నాన్ననే ఒప్పించాలి నేను. నిజానికి నాకు కంగారుగానే ఉంది, ఏమంటాడో అని.

అతను:—నన్ను మీ నాన్నకి వ్రాయమంటావా?

ఆవిడ:—నువ్వొద్దు వ్రాయించగలిగితే మీ నాన్నచేత మా నాన్నకొక ఉత్తరం వ్రాయించు.

అతను:—ఓ, తప్పకుండా వ్రాయిస్తాను.

ఆవిడ:—ఇప్పుడప్పుడేకాదు. నేను శలవలకి ఇంటికి వెళ్లేక అంతా చూసి నీకు వ్రాస్తాను. అప్పుడు వ్రాయించు.

అతను:—సరే.

ఆవిడ:—నాకీవాళ నువ్వు ఎంత ఆనందం కలగచేసేవో నీకు తెలియదు.

అతను:—ఈవాళ నాకుకూడా ఎంతో హాయిగా ఉంది—నీవల్ల. ఈరోజు నేను జన్మలోనైనా మరచిపోలేను...నీ చెయ్యి ఇలా ఇయ్యి.

ఆవిడ:—వద్దు.

అతను:—పరవాలేదు. ఒక్కసారి.

ఆవిడ:—చూస్తారు.

అతను:—ఎవరూ లేరు. ఎప్పుడు మనిద్దరం ఈ భయాలన్నీ లేకుండా స్వేచ్ఛగా ఉంటామో?

ఆవిడ:—మరి వెళ్లాలినువ్వు. అయిదుంపావుకి మా సభకి వెళ్లాలని చెప్పేను.

అతను:—వెళ్తాను. ఈ రాత్రంతా నీ మాటే తలచుకుంటూ ఉంటాను.

ఆవిడ:—నేనూ నీమాటే తలచుకుంటూ ఉంటాను.

అతను:—వెళ్లనా?... ప్రకాశరావుతో అట్టే సేపు మాట్లాడకు.

ఆవిడ:—అసలు మాట్లాడనే మాట్లాడను. నేనువెళ్లాలి.

అతను:—అసలే మాట్లాడొద్దనికాదు.

ఆవిడ:—అవును. తెలుసును, తెలుసును....మళ్లీ కాలేజిలోనే కలుసుకోడం

అతను:—సరే, వెళ్తున్నాను.

ఆవిడ:—ఉంటాను...చాలా ఆలస్యం అయిపోయింది.